
శ్రీరస్తు

దక్షిణామూర్తి అష్టకమ్

- భావార్థముతో -

శుభమస్తు

శ్రీ శంకరాచార్య విరచితం



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శంకరాచార్య విరచిత

శ్రీ దక్షిణామూర్తి అష్టకమ్ - భావార్థముతో -

01. విశ్వం దర్పణ దృశ్యమాననగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మనిమాయయా బహిరివోద్భూతం
యథా నిద్రయా।
యఃస్సాక్షాత్ కురుతే ప్రబోధ సమయే
స్వాత్మాన మేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

నిద్రించువాడు తన ఊహాత్మకమైన దృశ్యమునే కలలో చూచుచూ, మేల్కొన్న పిదప అదంతయూ నిజముకాదని, తనయందే ఉన్నదని తెలుసుకొను నట్లుగా - ఏ పరబ్రహ్మ తనయందే ఇమిడి ఉన్న ప్రపంచమును అద్దములో కనబడు దృశ్యము వలే తన మాయాశక్తిచే వెలుపల చూచుచూ జ్ఞానోదయమైన పిదప అదంతయూ తానే అని తెలుసుకొనునో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

02. బీజస్యాంత రివాంకురో జగదిదం ప్రాఙనిర్వికల్పం పునః
మాయా కల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతం।
మాయావీవ విజృంభయత్యపి మహా యోగీవ
యః స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

విత్తనములోని మొలకవలే సృష్టికి ముందు ప్రపంచమంతయూ జాతి - గుణ - క్రియల భేదము లేనిదిగా ఉండెను. పిదప సృష్టి సమయమున పరమాత్ముని మాయాశక్తిచే వివిధ దేశములు - వివిధ కాలములు ఏర్పడినవి. గారడివాని వలె ఈ ప్రపంచమును నిర్మించుచూ, మహాయోగివలే తన కిష్టమైనట్లు మార్చుచున్న గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

03. యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్ కల్పార్థగం భాసతే
సాక్షాత్ తత్త్వమసీతి వేదవచసా యో బోధ యత్యాశ్రితాన్।
యత్సాక్షాత్ కరణాత్ భవేన్న పునరావృత్తిర్ భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

సత్యస్వరూపుడైన ఏ పరమాత్మ స్వరూపము ప్రాపంచిక వస్తువులందు కనబడు చున్నదో, ఏ పరమాత్మ "తత్వమసి" మొదలగు వేదవాక్యములచే తన భక్తులకు బోధించుచున్నాడో, ఏ పరమాత్మ సాక్షాత్కారము వలన సంసార సాగరము నందు పునర్జన్మ కలుగదో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

04. నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీపప్రభా భాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాది కరణద్వారా బహిః స్పందతే।
జానామీతి తమేవ భాన్త మనుభాత్ ఏతత్ సమస్తం జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

అనేకములైన చిల్లులుగల కుండయందలి దీపపుకాంతి బయటకు ప్రసరించునట్లుగా, ఏపరమాత్ముని జ్ఞానము, కన్నులు మొదలగు ఇంద్రియముల ద్వారా బయటకు వెలువడుచున్నదో, ప్రకాశించు చున్న ఏ పరమాత్ముని తెలుసుకొని ఈ ప్రపంచ మంతయూ అనుసరించి ప్రకాశించుచున్నదో, అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

05. దేహం ప్రాణ మపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యంవిధుః
స్త్రీబాలంధ జడోపమాస్త్వహమితి భ్రాంతా భృశంవాదినః।
మాయాశక్తి విలాసకల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

స్త్రీలు - బాలురు - గ్రుడ్డివారు - మూర్ఖులతో సమానులైన ఇతర మతముల వారు, శరీరము - ప్రాణములు - చంచలమైన బుద్ధి - శూన్యము అను వాటిని ఆత్మగా భావించు చున్నారు. మాయాశక్తిచే ఏర్పడు అజ్ఞానమును తొలగించు గురుమూర్తి యైన దక్షిణామూర్తికి నమస్కారము.

06. రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయా సమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోప సంహరణతో యోభూత్ సుషుప్తః పుమాన్।
ప్రాగస్వాప్సమితి ప్రభోధసమయే యః ప్రత్యభి జ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

రాహువుచే కబళింపబడు సూర్యచంద్రులవలే ఏ పురుషుడు మాయాశక్తి ఆవరించుటవలన సత్తామాత్రుడై ఇంద్రియములను ఉపసంహరించుకొని అజ్ఞానమను గాఢనిద్రను పొందునో, మెలకువ కలుగగా పూర్వము నిద్రపోయితినని తెలుసుకొనునో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

07. బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వ వస్థాస్వపి
వ్యావృత్తా స్వనువర్తమాన మహమిత్యంత స్ఫురంతం సదా।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో ముద్రయా భద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

బాల్యము మొదలైనవి - మెలకువ మొదలైనవి అగు అన్ని దశలు వచ్చి పోవు చుండగా వాటి ననుసరించి "నేను" అని ఎల్లప్పుడు లోపల ప్రకాశించుచున్న ఆత్మ స్వరూపమును మంగళకరమైన జ్ఞానముద్రచే తన భక్తులకు బోధించు గురుమూర్తి యైన దక్షిణామూర్తికి నమస్కారము.

08. విశ్వం పశ్యతి కార్యకారణతయా సస్వామి సంబంధతః
శిష్యాచార్యతయా తథైవ పితృ పుత్రాద్యాత్మనా భేదతః।
స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయా పరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

కలయందు - మెలకువయందు మాయాశక్తిచే భ్రాంతినిపొంది విశ్వరూపుడైన తననే కార్యము - కారణముగాను, సేవకుడు - యజమానిగాను, శిష్యుడు - గురువు గాను, తండ్రి - పుత్రుడుగాను ఇంకా అనేక బేధములతో చూచుచున్న గురుమూర్తియైన ధక్షిణామూర్తికి నమస్కారము.

09. భూరంభాంస్యనలో నిలోంబర మహర్నాథో
హిమాంశు పుమాన్
ఇత్యాభాతి చరా చరాత్మకమిదం యస్త్యైవ మూర్త్యష్టకమ్।
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్ పరస్మాద్విభోః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

భూమి - జలము - అగ్ని - వాయువు - ఆకాశము - సూర్యుడు - చంద్రుడు -పురుషుడు అని ఎనిమిది రూపాలుగా ఈ చరాచర ప్రపంచమంతయూ నిండి వెలుగొందుచున్నవాడు, సర్వవ్యాపియైన తనకంటే ఇతరమైనదేదీ లేదని, విమర్శకులకు తెలియబరచువాడు అగు గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

10. సర్వాత్మత్వ మితి స్ఫుటీకృత మిదం యస్మాదముష్మిన్ స్తవే
తేనాస్య శ్రవణాత్ తదర్థ మననాద్ ధ్యానాచ్ఛ సంకీర్తనాత్।
సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిద్ధ్యేత్-తత్పునరష్టధా పరిణతం చైశ్వర్య మవ్యాహతమ్॥

ఈ దక్షిణామూర్తి స్తోత్రమునందు అంతటా వ్యాపించిన ఆత్మ ఒక్కటే అని నిరూపించబడినది. ఈ స్తోత్రమును వినుటవలన - అర్ధము తెలుసుకొనుట వలన - ధ్యానించుటవలన - చదువుటవలన - పరమాత్మ సాక్షాత్కారము కలుగును. అష్టైశ్వర్యములు లభించును.

ఇతి శ్రీ శంకరాచార్య విరచిత " దక్షిణామూర్తి అష్టకమ్ " సంపూర్ణమ్

- - === - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute